RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:22 11-7-2025 శుక్రవారం ఎడిటర్ :మర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /

# టీచర్?గా సీఎం చంద్రబాబు...

## వనరులు సబ్జెక్టుపై స్టూడెంట్స్?కి రాజకీయ పాఠాలు



## విద్యార్థులతోపాటు బుద్ధిగా పాఠం విన్న మంత్రి లోకేష్

- శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లాలో అపూర్వ సన్నివేశం
- వనరులు అనే సబ్జెక్టుపై స్టూడెంట్స్?కి క్లాస్?
- విద్యార్థులు రాజకీయాలపై ఆసక్తిపెంచుకోవాలి
- భవిష్యత్? తరాలకు మంచి లీడర్లు కావాలి
- ఉపాధి రంగాలతో పాటు పొలిటికల్?గా ఎదగాలి
- 8వ తరగతి విద్యార్థులతో సీఎం చంద్రబాబు
- విద్యార్థి దశలోనే మార్పు రావాలన్న ముఖ్యమంత్రి

సెంట్రల్ డెస్క్, , జులై 10,(టుడే విదుర) : ప్రస్తుతం విద్యార్థుల్లో రాజకీయాలపై ఆసక్తి లేని స్థితిలో.. పెద్ద చదువులతో ఉద్యోగాలు సంపాదించటమే కాదు.. రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవకులు కావాలని, ప్రజాప్రతినిధులు కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి లోకేష్తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూలులో.. సీఎం చంద్రబాబు ఉపాధ్యాయుడి పాత్ర పోషించారు. సుమారు 30 నిముషాలు జరిగిన ఈ బోధన అంత్యంత ఆసక్తికరంగా సాగింది. ఇదే తరుణంలో ఓ కీలక సన్నివేశం చోటు చేసుకుంది. విద్యార్థులు రాజకీయ నాయకులుగా మారాలని సీఎం తన అభిలాషను వ్యక్త పరిచారు. వనరుల పాఠ్యాంశం బోధన ముగియగానే.. పాఠం అర్థమైందా అని ప్రశ్నించారు. విద్యార్థులం దరూ అర్థమైం దన్నారు. ఈ టీచర్ బాగా చెప్పారా? అని మంత్రి లోకేష్ అనగానే.. ఒక విద్యార్థి మాత్రం ఇద్దరూ సమానమే అన్నాడు. ఇతడు రాజకీయ నాయకుడవు తాడని లోకేష్ అన్నారు.

# మయన్మార్ లో బందీలుగా యువకులు ..

## రక్షించాలంటూ

## పవన్ ను వేడుకున్న ఓ మాతృమూర్తి



- ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఏజెంట్
- రక్షించాలంటూ పవన్ ను వేడుకున్న ఓ మాతృమూర్తి
- ప్రాణాలతో ఉన్నారో లేదో అంటూ కన్నీటితో నివేదన
- స్పందించిన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులకు ఫోన్
- వారందర్నీ సురక్షితంగా అక్కడ నుంచి తీసుకువస్తామని హామీ


వెలగపూడి , జులై 10,(టుడే విదుర): ఉద్యోగాల ఆశతో విదేశాలకు వెళ్లి మానవ అక్రమ రవాణా ముఠాల చేతిలో చిక్కుకున్న తమ బిడ్డలను రక్షించాలంటూ ఓ తల్లి పెట్టిన కన్నీళ్లకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బాధితులను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, తక్షణ చర్యలకు మార్గం సుగమం చేశారు. విజయనగరానికి చెందిన గండబోయిన సూర్యకుమారి అనే మహిళ పవన్ కల్యాణ్ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయిన తన ఇద్దరు కుమారులతో పాటు మరో ఆరుగురు యువకులు మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, ఎలాగైనా కాపాడాలని ఆమె కన్నీటితో వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న 8 మంది తెలుగు యువకుల దుస్థితిని వారికి వివరించి, వారిని రక్షించాలని కోరారు. పవన్ చొరవపై కేంద్ర విదేశాంగ శాఖ సానుకూలంగా స్పందించింది. బాధితులను వీలైనంత త్వరగా గుర్తించి, సురక్షితంగా భారత్కు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చింది.

# పుట్టపర్తిలో లోకేష్ కు సమస్యల నివేదన



శ్రీసత్యసాయిజిల్లా,జులై 10, (టుడే విదుర) : శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం-2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురు వారం పుట్టపర్తి వచ్చారు. కప్పలబండ పారిశ్రామిక వాడలో ప్రజలు, కార్యకర్తలను మంత్రి కలుసుకున్నారు. అనంతరం ప్రతి ఒక్కరితో కలిసి ఫొటోలు దిగారు. ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కా రానికి కృషిచేస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కడపలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు మంత్రి లోకేశ్ ను కలుసుకున్నారు. యూని వర్సిటీ గుర్తింపు విషయంలో నెలకొన్న సమస్యను పరిష్క రించాలని విద్యార్థులు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


# భగవతీ శాకాంబరీ నమోస్తుతే



**అట్టహాసంగా శాకంబరీ ఉత్సవాలు..**
**మూడు రోజులు కనులవిందుగా మహోత్సవాలు..**
**చివరి రోజు పండ్లతో అలంకరణ**
**పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం**
**పౌర్ణమి రోజు స్వర్ణ కవచాలంకరణలో కనకదుర్గమ్మ..**
**అశేషంగా తరలివచ్చిన భక్తులు**
**అమ్మ నామస్మరణతో కిటకిటలాడిన క్యూ లైన్లు**
**పౌర్ణమి, ఆషాడం, శాకంబరీ ఉత్సవాలతో**
**పూర్తి ఆధ్యాత్మిక శోభ తో ఇంద్రకీలాద్రి**
**తనివితీర కదంభ ప్రసాదం స్వీకరణ..**

ఎన్టీఆర్ బ్యూరో,జులై 10(టుడే విదుర) : భక్తుల అంతులేని కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సకల జీవరాశికి ఆకలి, దప్పికలను తీర్చుతూ, సర్వ రోగాలను నియంత్రించే జగన్మాత కనకదుర్గమ్మ ప్రకృతి మాత శాకాంబరీ దేవిగా దర్శనమిస్తోంది. శాకాంబరీ దేవి ని భక్తితో పూజించిన, స్తోత్రం పఠించిన, ధ్యానించిన, నమస్కరించిన, జపించిన ఆజన్మాంతం, తరిగిపోని అన్న పానీయాలు అమృతం లభిస్తుందని ఇతిహాసాలు చెబుతుంటాయి. ఈ నేపథ్యంలో భక్తుజనులందరూ భగవతి శాకంబరీ నమోస్తుతే అంటూ అమ్మవారిని కీర్తిస్తూ, శాకంబరీ దేవి అవతారంలో ఉన్న కనకదుర్గమ్మ వారిని దర్శించుకుంటున్నారు. విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతున్న శాకంబరీ ఉత్సవాలు చివరి రోజు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. శ్రీ విశ్వ వాసు నామ సంవత్సర ఆషాడం మాసం ఈనెల 8వ తేదీన నుండి ప్రారంభమైన ఈ శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ వారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయాలను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మూడు రోజులపాటు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరణ చేయగా చివరి రోజు గురువారం వివిధ రకాల పండ్లతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణమంతా పచ్చని ఆకుకూరలు కూరగాయలతో మిరమిట్లు గొలిపే అందంతో కనిపిస్తోంది.

# నిరుపేద కుటుంబానికి హోంమంత్రి అనిత అండ



అనకాపల్లి, జులై 10,(టుడే విదుర) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదు ( పిలుపు మేరకు 'జీరో పావర్టీ – పీ4 – మార్గదర్శి – బంగారు కుటుంబం' పాలసీకి విశేష స్పందన వస్తోంది. పేదలకు చేయూతనిచ్చేందుకు పీ4లో భాగస్వాములయ్యేందుకు సంపన్న వర్గాలు ముందుకు వస్తున్నాయి. ఎంతో మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు సాయంగా నిలుస్తున్నారు. ఇప్పుడు తాజాగా.. ఓ నిరుపేద కుటంబానికి హోంమంత్రి వంగలపూడి అనిత అండగా నిలిచారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు హోం మంత్రి. పీ4 విధానంలో నిరుపేద కుటుంబానికి మంత్రి అనిత అన్ని విధాలుగా సాయంగా నిలిచారు.

యస్ రాయవరం మండలం దార్లపూడి గ్రామానికి చెందిన బాబ్జి కుటుంబానికి ఉపాధి కొరకు రెండు జర్సీ ఆవులను కొనిచ్చారు మంత్రి. అలాగే వారి కుమారుడు రూపస్ చదువు పూర్తయ్యే వరకు అయ్యే పూర్తి ఖర్చును హోంమంత్రి భుజాన వేసుకున్నారు. తక్షణం ఆర్థిక సహాయం అందజేశారు.

# అక్రమ తవ్వకాల కేసు..

## రెండో రోజు పోలీసు కస్టడీకి కాకాణి



నెల్లూరు, జులై 10,(టుడే విదుర) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని రెండో రోజు విచారణ నిమిత్తం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కనుపూరు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలపై నమోదైన కేసులో మాజీ మంత్రి నిందితుడిగా ఉన్నారు. (గురువారం) ఉదయం జిల్లా జైలు నుంచి కాకాణిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. వెంకటాచలం పోలీస్స్టేషన్కు తరలించి విచారించను న్నారు. ఈ కేసుకు సంబంధించి తొలి రోజు కస్టడీలో మొత్తం 30 ప్రశ్నలు అడిగారు వెంకటాచలం పోలీసులు. రాజకీయంగా, వ్యాపారపరంగా సన్నిహితంగా ఉండే వ్యక్తుల వివరాలు, వ్యాపార సంస్థలు వివరాలను కాకాణిని పోలీసులు అడిగారు. ఈ కేసులో ఏ2గా ఉన్న మందల వెంకట శేషయ్య గురించి, ఆయనతో ఉన్న సంబంధాలు, అల్లంపాటి నిరంజన్ రెడ్డితో ఉన్న వ్యాపార లావాదేవీల విషయంలో మాజీ మంత్రిపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా, న్యాయవాది ఎదుట కాకాణిని పోలీసులు విచారిస్తున్నారు. ఈరోజు సాయంత్రం ఐదు గంటలకు విచారణ ముగిసిన అనంతరం తిరిగి మాజీ మంత్రి కాకాణిని జిల్లా జైలుకు తరలించనున్నారు.

# సంపాదకీయం

## భారత పౌరుల ఓటుహక్కుపై దాడి

భారత గణతంత్ర రాజ్యంలో పుట్టిన, పుట్టబోయే ప్రతి భారత పౌరుడికి ఒక విలువైన ఆస్తి ఉన్నది. ఓటు హక్కే ఆ అమూల్య ఆస్తి. భారత పౌరుల సామూహిక ఓటు హక్కుల తొలగింపునకు మన పాలకులు ఇప్పుడొక సాహసోపేతమైన ప్రయత్నం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ %–% 'సర్')ను చేపట్టనున్నట్టు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ బృహత్ కార్యానికి తొలుత బిహార్‌లో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, ఆపై విశాల భారతదేశమంతటా ఆ ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టి పూర్తి చేస్తారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కచ్చితంగా భారత పౌరుల సామూహిక ఓటుహక్కుల తొలగింపే, సందేహం లేదు.నోట్ బంది దేశ్ బంది (కోవిడ్ ఆపత్కాలంలో లాక్‌డౌన్) గుర్తున్నాయా? ఇప్పుడు ఓటుబంది (సామూహిక ఓటు హక్కుల తొలగింపు)కే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు పూనుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్దేశం ఏమో గానీ ఈ ప్రక్రియ ప్రాథమికంగా లోపభూయిష్టమైనది, చాలా హానికరమైనది, నైతికంగా ఎంత మాత్రం సమర్థించలేనిది. 'సర్' పర్యవసానాలు భయానకంగా కనిపిస్తున్నాయా? ఆ ప్రతిపాదన వాస్తవికంగా లేదు. భయాందోళనలకు దారి తీసేదిగా ఉన్నది. దానిని నిశితంగా పరిశీలిద్దాం.ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాను పునఃపరీక్షించడం ద్వారా ప్రత్యేక సమగ్ర సవరణ ఎనాడో జరిగి ఉండవలసిన ప్రక్రియ అనే భావన చాలా మందిలో ఉన్నది. దీనిని పక్కన పెడదాం. బిహార్‌లో అటువంటి ప్రక్రియ ఆరు నెలల క్రితమే జరిగింది. లక్షలాది కొత్త ఓటర్ల పేర్లను చేర్చారు. దాదాపుగా అంతే సంఖ్యలో పాత ఓటర్ల పేర్లను తొలగించారు. చెప్పుకోదగ్గ ఫిర్యాదులు ఏవీ రాలేదు. అయితే ఎన్నికల సంఘం ఇప్పుడు ఆదేశించిన ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిగా కొత్త ప్రక్రియ. సరికొత్తగా ఆరంభించి పూర్తి చేసేది. ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తారు. గతంలో ఎన్నడూ జరగనిది. సమగ్ర సవరణ పేరిట గతంలో ఓటర్ల జాబితా సవరణ జరిగేది. ఓటర్ల జాబితా కంప్యూటరీకరణతో 2003 తరువాత అటువంటి సవరణ ప్రక్రియను కొనసాగించలేదు. ఇప్పుడు ఎన్నికల సంఘం పూర్తిగా ఒక కొత్త ప్రక్రియను ప్రారంభించింది. ఈ కొత్త ప్రక్రియతో ఓటర్ల జాబితాలో తన పేరు ఉండేలా చూసుకునే బాధ్యత పూర్తిగా పౌరుడిదే.రాజ్యవ్యవస్థకు ఏంత మాత్రం సంబంధముండదు. జూలై 25లోగా పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌ను సమర్పించని వారి పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉండదు. అలా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత పూర్తిగా పౌరుడిదే. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత పొందాలంటే ప్రతి వ్యక్తీ తన భారత పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రామాణిక పత్రాలు విధిగా సమకూర్చాలి. ఇది నిజానికి అనధికారిక జాతీయ పౌర పట్టికే (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్) అవుతుంది.ప్రత్యేక సమగ్ర సవరణ అసలు ఉద్దేశాలను ఎన్నికల సంఘం చాలా తెలివిగా కప్పిపుచ్చుతోంది. అవేమిటో శోధిద్దాం. ఓటర్ల జాబితాలో ఉండే అర్హత పొందేందుకు అవసరమైన డాక్యుమెంటరీ రుజువులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఎన్నికల సంఘం ఉత్తర్వు స్పష్టంగా ఉన్నది: ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్‌ను ప్రస్తుత ఫోటో, సంతకాలు, కొన్ని మౌలిక వివరాలతో నింపి, పౌరసత్వ రుజువుతో సమర్పించాలి. 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారి (పేరు, నివాసం మారకుండా ఉంటే) కొత్త జాబితాలో స్థానం సంపాదించుకోవడం సులువవుతోంది. 2003 ఓటర్ల జాబితాలో తమ పేరు ఉన్న పేజీ కాపీని తమ ఎన్యూమరేషన్ ఫామ్‌తో జత చేసి ఇవ్వాలి. ఇది వారి పౌరసత్వానికి రుజువుగా పరిగణితమవుతుంది. 4.96 కోట్ల మందికి (ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఉన్న 63 శాతం మంది) ఈ దగ్గరి దోవను ఉపయోగించుకునేందుకు అర్హులు అని ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సినవారు 3 కోట్ల మంది కంటే తక్కువగా ఉంటారని పేర్కొంది. ఇదొక విచిత్ర వాదన అని, ఇందులో నిజం లేదని రాహుల్ శాస్త్రి నిర్ధారించారు (జూలై 1, 'డేటా పాయింట్', ది హిందూ). 2003 నుంచి మరణాల సంఖ్యను, వలసపోయిన వారి సంఖ్యను, నివాసం మారిన వారి సంఖ్యను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదని, తత్కారణంగా కొత్త ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సిన వారి సంఖ్య యథార్థంగా 3.16 కోట్లు అని రాహుల్ శాస్త్రి నిరూపించారు.ప్రస్తుత ఓటర్ల జాబితాలోని 7.9 కోట్ల మందిలో 4.74 మంది పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించిన రుజువులతో తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవలసి ఉంటుంది. ఇటువంటి బాధ్యత ఉన్న వారిని మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. మొదటి తరగతివారు 38 సంవత్సరాలకు మించిన వయసు ఉన్నవారు (జూలై 1, 1987కు ముందు పుట్టిన వారు). వివిధ కారణాల వల్ల 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు లేని వీరు తమ పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 20 నుంచి 38 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (జూలై 1, 1987, డిసెంబర్ 2, 2004 మధ్య పుట్టినవారు) రెండు రుజువులు చూపవలసి ఉన్నది. తాము పుట్టిన తేదీతో పాటు తల్లి లేదా తండ్రి పుట్టిన తేదీకి కూడా ధ్రువీకరణపత్రాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇక 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (డిసెంబర్ 2, 2004 తరువాత పుట్టినవారు) మూడు రుజువులు సమర్పించవలసి ఉంటుంది. తమ సొంత పుట్టిన తేదీతో పాటు తల్లి, తండ్రి పుట్టిన తేదీల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

## ఘోర ప్రమాదం.. స్పాట్‌లోనే ముగ్గురు మృతి




కర్నూలు:జూలై 10 (టుడే విదుర): జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ వద్ద బండల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్?ను స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. ఏడుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అలర్ట్ అయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాద సమయంలో అక్కడికక్కడే ఇద్దరు చనిపోగా.. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మూడు నెలల చిన్నారి నాదియా ప్రాణాలు విడిచింది. మృతులంతా కడప జిల్లా మైదుకూరు వాసులుగా గుర్తించారు పోలీసులు. రోడ్డుప్రమాదంపై సమాచారం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు.


## ప్రకాశం జిల్లాలో విషాదం.. అదశ్యమైన బాలుడు మృతి




ప్రకాశం జూలై 10 (టుడే విదుర): ప్రకాశం జిల్లా కంభంలో విషాదం చోటు చేసుకుంది. లింగోజిపల్లిలో అదృశ్యమైన మూడేళ్ల బాలుడు లక్షిత్ మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల క్రితం అంగన్వాడీ పాఠశాలకు వెళ్లిన లక్షిత్ తిరిగిరాలేదు. దీంతో అతని కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సూరేపల్లి సమీపంలో ఇవాళ(గురువారం) అతని మృతదేహం కనిపించింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషాద ఘటనకు సంబంధించిన పూర్తి పూర్తి వివరాలు పోలీసు విచారణలో తెలియాల్సింది.

# ఆ నాలుగు విమానాశ్రయాలకు హడ్కో రుణం

### ఒంగోలు, సాగర్‌లలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు



అమరావతి,జూలై 10 (టుడే విదుర): శ్రీకాకుళం, దగదర్తి, అమరావతి, కుప్పం విమానాశ్రయాల నిర్మాణానికి రూ. 1,000 కోట్లు కావాలని హడ్కోను రాష్ట్ర విమానాశ్రయాభివృద్ధి సంస్థ కోరింది. ప్రాథమిక సమాలోచనల అనంతరం ఆ మొత్తాన్ని రుణంగా అందించేందుకు హడ్కో సూత్రప్రాయంగా ఆమోదించింది. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేందుకు బుధవారం మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో ఈ నాలుగు విమానాశ్రయాల నిర్మాణాలకు విమానాశ్రయాభివృద్ధి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాగా.. ఒంగోలు, నాగార్జునసాగర్‌లలోనూ కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని సంస్థ భావించింది. అందుకోసం టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈఎఫ్ఆర్) నివేదికను తయారు చేసేందుకు ఆసక్తి గల సంస్థల కోసం మంగళవారం ప్రకటన జారీ చేసింది. 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. కాగా, రాష్ట్రంలో విమాన తయారీ సంస్థను ఏర్పాటు చేస్తామంటూ సరళ ఏవియేషన్ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి ప్రతిపాదనలు అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు వెలగపూడి సచివాలయంలో ఆయనతో సమావేశమయ్యారు. పైలట్ శిక్షణలో ప్రతిష్ఠాత్మక సంస్థ గోల్డెన్ ఎప్యూలెట్స్ ఏవియేషన్ అకాడమీ ప్రతినిధులు కూడా సచివాలయంలో మంత్రి జనార్దనరెడ్డిని కలిశారు.రాష్ట్రంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు.

# బదిలీల రచ్చ



- ◆ సోమవారం రాత్రి వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆ శాఖ అసిస్టెంట్లు
- ◆ జిల్లాలో కొలిక్కిరాని సచివాలయ ఉద్యోగుల బదిలీలు
- ◆ రచ్చకెక్కుతున్న వివాదాస్పద జాబితాలు
- ◆ తప్పులతడకగా మహిళా పోలీసుల లిస్టు
- ◆ పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శుల బదిలీల్లో మతలబు
- ◆ సంక్షేమ శాఖల్లో ఇష్టానుసారంగా మార్పులు
- ◆ కోర్టును ఆశ్రయించిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు
- ◆ వ్యవసాయ శాఖలో కొలిక్కిరాని బదిలీలు

జూలై 10 (టుడే విదుర):ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను ఇటీవల బదిలీ చేస్తూ జాబితా విడుదల చేశారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధనతో ఈ బదిలీలు జరిగాయి. అయితే, శాసనసభ్యుల సిఫార్సు లేఖలను ఆధారంగా చేసుకుని అసిస్టెంట్లను కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సీనియారిటీ ఉన్నవారు కోరుకున్న ప్రాంతాల్లో కాకుండా 100 కిలోమీటర్ల దూరంలోని సచివాలయాలకు బదిలీ అయ్యారు. తమ కంటే జూనియర్లను వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారని, తమను మాత్రం దూరప్రాంతాలకు పంపారని సీనియర్లంతా కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టర్‌కు తమ గోడు తెలుపుకొన్నారు. మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. వీరి సమస్యను అధికారులు పరిష్కరించకపోగా, బదిలీల జాబితాలను విడుదల చేశామని, అందుకు అనుగుణంగా వెళ్లాలని హుకుం జారీచేశారు. దీంతో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అయినా అధికారులు స్పందించలేదు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు.ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ విభాగం అధికారులు బదిలీల జాబితాలను ఇష్టానుసారంగా తయారుచేసి విడుదల చేశారు. గ్రేడ్-5 సెక్రటరీలను ఒక్కో సచివాలయానికి ఒక్కరినే కేటాయించాలి. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు, ఇతరత్రా సిఫార్సులు వచ్చాయనే కారణాలు చూపి అధికశాతం సచివాలయాల్లో ఇద్దరేసి చొప్పున బదిలీ చేశారు. ఈ విషయాన్ని డీపీవో కార్యాలయ అధికారులకు తెలియజేయడంతో ఆ తప్పులను సరిదిద్ది, రెండో జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితాపై కలెక్టర్‌తో సంతకం చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ జాబితాలను డీపీవో కార్యాలయంలో కాకుండా పెనమలూరు, గంగూరులో తయారు చేశారని, ఇందులో ఏదో మతలబు ఉందని సచివాలయ కార్యదర్శులు చెప్పుకొంటున్నారు. దివ్యాంగురాలైన ఓ మహిళా సచివాలయ కార్యదర్శి.. తన ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు దగ్గరలోని సచివాలయానికి బదిలీ చేయాలని కోరింది. ఆమె అభ్యర్థనను పట్టించుకోని డీపీవో కార్యాలయ అధికారులు 60 కిలోమీటర్ల దూరంలోని సచివాలయానికి బదిలీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# మైనింగ్ మాఫియా ధనదాహం.. నిండుప్రాణం బలి



మట్టిలో కూరుకున్న ఎక్స్‌కవేటర్
అర్ధరాత్రి రాఘవాపురం కొండలో అక్రమ తవ్వకాలు
%ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు
లారీపై మట్టిపడి డ్రైవర్ దుర్మరణం
ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు సైతం గాయాలు
అధికార పార్టీ వారు కావడంతో పట్టని అధికారులు

నందిగామ,జూలై 10 (టుడే విదుర): మైనింగ్ మాఫియా ధనదాహానికి నిండుప్రాణం బలైంది. అధికార పార్టీ ముఖ్యనాయకుల కనుసన్నల్లో మండలంలోని రాఘవాపురం కొండను రాత్రివేళల్లో పెకిలిస్తూ నిత్యం 200 లారీల మట్టిని కొల్లగొడుతున్నారు. తెల్లవారుజామున మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతుండగా, కొండచరియలు విరిగిపడి టిప్పర్‌పై పడ్డాయి. భారీగా కొండచరియలు పడటంతో టిప్పర్‌తో పాటు ఎక్స్‌కవేటర్ మట్టిలో కూరుకుపోయింది. ఒక్కసారిగా అంత మట్టిపడటంతో టిప్పర్ పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ దాసరి చిన వెంకటేశ్వర్లు (42) గాయాలు కాగా, విజయవాడలోని ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయని తెలుస్తోంది. అతని వివరాలు బయటపడకుండా మాఫియా జాగ్రత్త పడింది. ఘటనాస్థలంలో మట్టిలో కూరుకుపోయిన టిప్పర్‌ను క్రేన్ సాయంతో గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద పెట్టారు. కాగా, తెరవెనుక ఆ ఘటనను కప్పిపుచ్చే కుట్రలు చేస్తున్నట్టు తెలిసింది.రాఘవాపురం గట్టు వద్ద మట్టి అక్రమ రవాణా జరుగుతున్న సంగతి తెలిసినా స్పందించని అధికారులు.. ఓ వ్యక్తి నిండిప్రాణం బలైనా కూడా కనీసం పట్టించుకోలేదు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది ఇటువైపు తిరిగి చూడలేదు. మట్టి అక్రమ తవ్వకాలు జరిపేది అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు కావడం వల్లే ఇలా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఘటన తెల్లవారుజామున జరిగితే మధ్యాహ్నం వరకు పోలీసులెవరూ ఆ ప్రాంతాన్ని సందర్శించలేదు. ఇదేమిటని ప్రశ్నించగా, పోలీసుల నుంచి విచిత్రమైన సమాధానం వచ్చింది. ఫిర్యాదు అందాకే ఘటనాస్థలిని పరిశీలిస్తామని, మట్టి అక్రమ తవ్వకాలపై తమకు ఎటువంటి సంబంధం లేదని వింతగా సమాధానం చెప్పారు. కాగా, పోలీసుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలూ వస్తున్నాయి. కనీసం రెవెన్యూ యంత్రాంగం కూడా ఇటువైపు చూడకపోవడం గమనార్హం.

అర్ధరాత్రి ఆత్రుతలో..

చేసేది అక్రమ వ్యాపారం కావడం వల్లే అర్ధరాత్రి ఆత్రుతగా ఇలా లోడింగ్ చేస్తున్నట్లు తెలిసింది. టిప్పర్‌ను కొండకు ఆనించి పెట్టి, ఎక్స్‌కవేటర్‌తో నేరుగా లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం. మట్టిని కిందకు లాగి, లోడింగ్ చేస్తే ఆలస్యమవుతుందనే ఇలా చేశారని తెలిసింది.

# సచివాలయం తలుపులు మూసి.. ఖాళీ బిందెలతో ఆందోళన



ముసునూరు, జూలై 10 (టుడే విదుర): రమణక్కపేట ఎస్సీ కాలనీ మహి ళలు తాగునీటి కోసం సచివాలయం తలుపులు మూసివేసి ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. కాలనీలోని పంచాయతీ బోరులో విద్యుత్ మోటారు మరమ్మతుకు గురై ఇరవై రోజులు అయిందని, తాగు నీటితో పాటు కనీస అవసరాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని మహిళలు అవేదన వ్యక్తం చేశారు. సమస్యను సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. తాగునీరు ఇచ్చేవరకు ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తే లేదని భీష్మించారు. దీంతో సచివాలయ సిబ్బంది సమస్యను ఎంపీడీవో బీ.ఏ సత్యనారాయణకు తెలిపారు. రెండు రోజుల్లో మోటారు బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఉన్న మంచినీటి బోరును ఎంపీడీవో పరిశీలించి కార్యదర్శి సుజాతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటారును బిగించే వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.

# 641.5 కిలోల గంజాయి ధ్వంసం

ఎస్పీ సమక్షంలో గంజాయి ధ్వంసం
జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 64 కేసులలో స్వాధీనం
%బందోబస్తు నడుమ గుంటూరు తరలింపు



భీమవరం క్రైం,జూలై 10 (టుడే విదుర): జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని గుంటూ రు తరలించి ధ్వంసం చేశారు. జిల్లాలోని 23 పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసులలో 641.544 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా కొండవీడుకు తరలించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఏఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద సభ్యులుగా ఉన్న 'డ్రగ్ డిస్పోజల్ కమిటీ', మధ్యవర్తుల ఆధ్వర్యంలో గంజాయి ధ్వంసం చేశారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మధ్యవర్తుల సమక్షంలో కేసుల వారీగా గంజా యి తూకం వేసి పరిశీలించారు. మొత్తం 64 కేసులలో 641.544 కిలోల గంజాయిని ప్రత్యేక కవర్లు, సంచులలో పెట్టి, వాటికి లక్క సీలు వేశారు. గంజాయి సంచులను పోలీసు బందోబస్తు నడుమ గుంటూరు తరలించారు. కొండవీడు పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మొదటి బాయిలర్‌లో వేసి ధ్వంసం చేశారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో, ఫొటోగ్రఫీ ద్వారా నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ కె.మానస, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, భీమవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బాలరాజు, మధ్యవర్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల గ్రేడింగ్ నమోదు చేయండి

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో నారాయణ
వేంద్ర జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో నారాయణ



పాలకోడేరు,జూలై 10 (టుడే విదుర): పాఠశాలలో విద్యార్థుల గ్రేడింగ్ ప్రతి నెల నమోదు చేయాలని డీఈవో నారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. వేంద్ర జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల ప్రార్థన సమయానికి హాజరై పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. పదో తరగతి విద్యార్థులతో కొంత సేపు మాట్లాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచాలని, తల్లిదండ్రుల నుంచి సెలవు చీటీ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హ్యాండ్ బుక్ ప్రకారం బోధన చేయాలని, ప్రతి సబ్జెక్టులలో ప్రతి విద్యార్థికి బేసికల్ నాలెడ్జ్ ఉండాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల విషయంలో ప్లానింగ్ ఉండాలని, సబ్జెక్టు వారీగా క్లబ్‌లు ఉండాలని, ప్రతిరోజు ప్రతి విద్యార్థితో వర్క్ చేయించాలని, హోం వర్క్ తప్పనిసరిగా చూడాలని, పదో తరగతి విద్యార్థులతో ప్రతిరోజు, ప్రతి సబ్జెక్టులో ఒక ప్రశ్న రాయించి చదివించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో శ్రీమన్నారాయణ ఉన్నారు. డీఈవో సూచనలు తప్పనిసరిగా పాటిస్తామని హెచ్‌ఎం జీవీవీ శ్రీనివాస్ అన్నారు. జె.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, బోసు బాబు, రాధ, పంపన సాయిబాబు, ఫణిరాజేష్, విశ్వనాథరాజు, రాజవర్ధిని, నాగబాబు, ఏసు బాబు, ఎం.శ్రీనివాసరావు, సునీల్ పాల్గొన్నారు.

# నకిలీ వ్యక్తులతో రిజిస్ట్రేషన్



కోడుమూరు, జూలై 10 (టుడే విదుర): చనిపోయిన వ్యక్తుల పేరుతో 5 సెంట్ల స్థలాన్ని నకిలీ వ్యక్తులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ కథ బెడిసికొట్టి చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలు అయ్యారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ ఎం.తబ్రేజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు పట్టణానికి చెందిన అన్నదమ్ములు కాకే నారాయణ, కాకే నాగరాజు 1984లో కోడుమూరు సమీపంలోని 100 సర్వే నంబర్‌లో ఐదు సెంట్ల స్థలాన్ని కొన్నారు. అనారోగ్యంతో 2013లో నారాయణ, 2014లో నాగరాజు మృతి చెందారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన సోమేష్, కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మధు, కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రాజోలి గిడ్డయ్య కలిసి చనిపోయిన అన్నదమ్ముల పేర్లు ఉన్న వ్యక్తుల పట్టుకొని వారి ఐదు సెంట్ల స్థలాన్ని కాజేయాలని ప్రథకం వేశారు. గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన బోయ నారాయణ, నాగరాజు అనే వ్యక్తులను వెతికి పట్టుకున్నారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులతో కుమ్మకై ఐదు సెంట్ల స్థలాన్ని 2023లో ఆ నకిలీ వ్యక్తులతో రిజిస్టర్ చేయించారు. ఐదు సెంట్ల ప్లాట్‌ను అమ్మగా వచ్చిన రూ.18లక్షలను అందరూ సమానంగా పంచుకొన్నారు. చనిపో యిన కాకే నారాయణ భార్య లీలావతి భర్త కొనుగోలు చేసిన స్థలాన్ని చూసేందుకు ఇటీవల కోడుమూరుకు వచ్చింది. ఆ సందర్భంగా అసలు విషయం బైటపడింది.లీలావతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ డివై.స్వామి విచారణ చేపట్టి బుధవారం సోమేష్, మధు, రాజోలి గిడ్డయ్య, బోయ నారాయణతో పాటు ఇందుకు సహకరించిన మాదాసు నాగేష్‌ను అరెస్టు చేశారు. నిందితులు నాగరాజు, విష్ణు పరారీలో ఉన్నారు. ఈ కేసులో మరి కొంత మందిని విచారించాల్సి ఉందని సీఐ చెప్పారు.

# ఎస్ఎస్ లింక్ కెనాల్ లిఫ్ట్ పనులకు మోక్షం



☞ ఎస్ఎస్ లింక్ కెనాల్ (ఫైల్ ఫొటో)

☞ తిరుపతిలో టీజీపీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి అనుమతి

☞ మామిడి మద్దతు ధరకు రూ.260 కోట్లు మంజూరు

☞ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

తిరుపతి, జూలై 10 (టుడే విదుర): జిల్లాకు మేలు చేసే ఎస్ఎస్ లింక్ కెనాల్, మామిడి రైతులకు సబ్సిడీ చెల్లింపుతో పాటు తిరుపతిలో తెలుగుంగ ప్రాజెక్టు గెస్ట్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి నిర్ణయాలను అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం తీసుకుంది. ఫ జిల్లాలో ఆరున్నరేళ్లుగా పెండింగులో ఉన్న సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ లిఫ్ట్ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ పనులకు 2019 జనవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.292.66 కోట్లకు పరిపాలనా మంజూరు లభించింది. హైదరాబాదుకు చెందిన మెస్సర్స్ ఎంఈఐఎల్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. అదే ఏడాదిలోనే రూ. 250.51 కోట్లతో అగ్రిమెంట్ ఖరారైంది. ఈ నిధులతో మేర్లపాక చెరువు నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కెనాల్, లిఫ్ట్ నిర్మాణాలు చేపట్టాలి. నిర్మాణ సంస్థ పనులు చేపట్టి 12.22 శాతం పనులు పూర్తి చేసింది. దానికోసం రూ.30.61 కోట్లు ఖర్చు చేసింది. తర్వాత ప్రభుత్వం మారడంతో గత వైసీపీ ప్రభుత్వం ఈ పనుల టెండర్లను రద్దు చేసింది. ఆ తర్వాత టెండర్లు పిలవకపోవడంతో పనులు ఆగిపోయాయి. పనులు పూర్తి చేయడానికి రూ.219.90 కోట్లు, భూసేకరణ తదితర ఖర్చుల కోసం రూ.64 లక్షలు కావాలి. తాజాగా మంత్రివర్గం ఈ పనులు చేపట్టేందుకు అనుమతివ్వడంతో త్వరలో పనులు మొదలు కానున్నాయి.ఫ తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో తెలుగు గంగ ప్రాజెక్టు అతిథి గృహం నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మెస్సర్స్ ఐ.మునిమోహన్‌రెడ్డి అండ్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. ప్రభుత్వం మారడంతో ఆలస్యంగా 2023 డిసెంబరులో అగ్రిమెంట్ ఖరారైంది. రూ.3.78 కోట్లతో చేపట్టాల్సిన పనులు కేవలం రూ.41 లక్షల మేరకే జరిగాయి. ఆ మొత్తాన్నీ కాంట్రాక్టు సంస్థకు చెల్లించలేదు. తిరిగి పనులు మొదలుపెట్టేందుకు మంత్రివర్గం అనుమతిచ్చింది.మామిడి సబ్సిడీ కింద రూ.260 కోట్లుప్రస్తుత సీజనులో ఉమ్మడి చిత్తూరు జిల్లా తోతాపురి మామిడి రైతులు ధరల పతనంలో నష్టపోకుండా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.260 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 76,700 మంది రైతులు 80 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్నారు. ఈ సీజనులో 6.50 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చింది. ఈ మొత్తం సేకరణకుగానూ కిలోకు రూ.4 వంతున సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం దానికోసం రూ.260 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి జిల్లా వరకూ చూస్తే 14,582 హెక్టార్లలో తోతాపురి సాగవుతోంది. ఆ మేరకు 1.45 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఈనెల 5వ తేదీ నాటికి జిల్లాలో 10,046 మంది రైతులకు చెందిన 67,988.68 టన్నుల తోతాపురి సేకరించడం జరిగింది. దానికి గానూ రైతులకు సబ్సిడీ కింద రూ. 27.18 కోట్లు చెల్లించాల్సి వుంది. మొత్తం తోతాపురి మామిడి సేకరణ పూర్తయితే సబ్సిడీ కింద రూ. 58 కోట్లు ప్రభుత్వం నుంచీ రైతులకు అందుతుంది.

## పామాయిల్ వెల..విల!



పామాయిల్ రైతుల ఆందోళన %తగ్గిన దిగుమతి సుంకం
కానరాని కనీస మద్దతు ధర ఆదుకోవాలని వేడుకోలు

ఆత్రేయపురం, జూలై 10 (టుడే విదుర):జిల్లా లో ఆయిల్‌పామ్ రైతుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారు. వరిలో అంతరపంటగా వేసుకుని ప్రభుత్వ రా యితీలు పొందిన కొందరు రైతులు పామాయి ల్ సాగు చేపడుతున్నారు. గతేడాది దిగుబడి తో పాటు మద్దతు ధర లభించడంతో జిల్లాలో రైతులు ఈ సాగు చేపడుతున్నారు. ఆ దిశగా ఉద్యానశాఖ ఈ సాగు చేపట్టాలంటూ ప్రోత్సాహాన్ని అందిస్తోంది. మన రాష్ట్రంలో 1,96,801 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపడుతున్నారు. 39.36 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేస్తూ దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 76,014 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్నారు. ప్రస్తుత కోనసీమ జిల్లాలో 1110 ఎకరాల్లో ఈ సాగు ఉంది. ప్రస్తుత తరుణంలో ఆయిల్‌పామ్ గెల ధర పతనం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతంనుంచి 16.5శాతానికి తగ్గించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న చర్యలతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. గతేడాది టన్ను పామాయిల్‌గెల ధర రూ.20 వేల నుంచి రూ.21 వేల వరకు పలికింది. దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో టన్ను రూ.18,650కు పడిపోయింది. ఇది మరింత తగ్గవచ్చని రైతులు కలవరపడుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

టన్ను రూ.18,650 ఉంది..


ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.18,650 ఉంది. కోనసీమలో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. అయితే ప్రస్తుతం ధర తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ ధర ఒకేలా ఉండదు.. ఏ పంటకైనా తగ్గడం పెరగడం సర్వసాధారణం.. అయితే ఒకేసారి రూ.2 వేలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## శేషా'రత్నం'.. అవయవదానం..




మంగళగిరి జూలై 10 (టుడే విదుర): మండలంలోని నిడమర్రు గ్రామానికి చెందిన 63 ఏళ్ల మండేపూడి శేషారత్నం ఈనెల 1వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమెను మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ చేర్చగా 8వ తేదీన ఆమెకు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్‌పై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారి సమ్మతించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవన్‌దాన్ సన్నిహిత సమన్వయంతో అవయవ పునరుద్ధరణ ప్రక్రియను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కాలేయం, రెండు మూత్రపిండాలు, కళ్లను మార్పిడి కోసం కేటాయించారు. ఎయిమ్స్ మంగళగిరిలో రెండవ కాడవెరిక్ కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించింది. మరొక కిడ్నీని, చిన్న అవుటపల్లి, విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్-రీసెర్చ్ ఫౌండేషన్‌కు, కాలేయాన్ని తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు, కార్నియాలను (కళ్ళను) విజయవాడలోని ఎల్.వి ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా శేషరత్నం భౌతికకాయాన్ని ఎయిమ్స్ మంగళగిరి డీన్ అకడమిక్, మెడికల సూపరింటెండెంట్, జాయింట్ మెడికల్ సూపరింటెండెంట్ ఫ్యాకల్టీ, సిబ్బందితో పాటు గుంటూరు జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎరుగుల అన్నపూర్ణ, మంగళగిరి తహశీల్దార్ కె.దినేష్ రాఘవేంద్ర, ఆర్ఐ కె.గోపి సందర్శించి నవాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను సత్కరించారు.

## మంచి భర్త.. నాన్నను కాలేకపోయా.. సారీ!



రాజమహేంద్రవరం సిటీ, జూలై 10 (టుడే విదుర):మంచి నాన్నను కాలేకపోయాను..మంచి భర్తను కాలేకపో యాను.. మంచి కొడుకును కాలేకపోయాను.. సారీ అంటూ ఒక వ్యక్తి క్షణి కావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన మెట్ల కుమార్ (45) గత దశాబ్ద కాలంగా జర్నలిజంలో ఉన్నారు. తూర్పుగోదా వరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రముఖ దినపత్రికలో గత ఎనిమిదేళ్లుగా క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య గౌరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజమహేంద్రవరం బొమ్మూరు నేతాజీ నగర్‌లోని ఎర్రన్నాయుడు హిందీ కళాశాల సమీపంలో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో మనస్పర్థల కార ణంగా గత నెల 23న ఉదయం 11 గంటల సమయంలో బయటకు నడుచుకుంటూ వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం రైల్వే క్వార్టర్స్ రోడ్డులోని ఆలయానికి వచ్చిన వారికి దుర్వాసన రావడంతో 112కు ఫోన్ చేసి సమాచారం అందిం చారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహం మెట్ల కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా పాడైంది. మెట్ల కుమార్ బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మెట్ల కుమార్ మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తారు. అయితే కుమార్ బిర్యానీలో గడ్డిమందు కలిపి తిని ఆత్మహ్యాకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ప్రీ పిహెచ్‌డి ఫలితాలు విడుదల

ఎఎన్‌యు జూలై 10 (టుడే విదుర):ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఫిల్ పార్ట్-1, ప్రీ పిహెచ్‌డి-2025 పరీక్షల ఫలితాలను ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు విడుదల చేశారు. ఆర్ట్స్, సైన్స్, ఫార్మసి, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఈ పరీక్షలకు పరిశోధకులు హాజరుకాగా 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 18వ తేదీలోగా ఒక్కో పేపరకు రూ.1500 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## నవోదయం 2.0 విజయవంతం

జూలై 10 (టుడే విదుర):పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెఎన్‌వి.ప్రభు కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు తెలిపారు. నవోదయం 2.0 విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నూజివీడు సిఐ ఎ.మస్తానయ్య పాల్గొన్నారు.



## పంచాయతీ కార్యదర్శులకు అవగాహన



జూలై 10 (టుడే విదుర):ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ పురోగతి సూచిక, వెర్షన్ 2.0పై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నీరజ నాయుడు, కె.సుజాత, ధర్మవతి, శ్రీనివాసచౌదరి, శ్రీరామచంద్ర, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

# రూ.5కే ఇడ్లీ, పూరి, ఉప్మా..


## ఇందిరమ్మ క్యాంటీన్లలో అల్పాహారం

## ఏటా రూ.15.33 కోట్లు ఖర్చవుతుందని అంచనా



హైదరాబాద్ సిటీ:జూలై 10 (టుడే విదుర): ఇందిరమ్మ క్యాంటీనలో అల్పాహారం అందించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. హరే కృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామ్యంతో గ్రేటర్‌లోని 150 కేంద్రాల్లో త్వరలో అల్పాహారం(టిఫిన్) అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనంలానే రూ.5కే పౌరులకు అల్పాహారం అందించనున్నారు. ఒక్కో అల్పాహారానికి రూ.19 ఖర్చు కానుండగా.. అందులో రూ.14 జీహెచ్ఎంసీ భరించనుంది. లబ్ధిదారుల నుంచి రూ.5 వసూలు చేస్తారు.ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరి, వడ వంటివి క్యాంటీన్లలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అందించనున్నారు. ఇందుకు ఇప్పటికే ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్లను ఆధునీకరిస్తున్నారు. 10/40 పరిమాణంలో 60 కేంద్రాలు, 10/20 పరిమాణంలో 79 కేంద్రాలు సిద్ధమవుతున్నాయి. వీటికి రూ.11.29 కోట్లు ఖర్చు కానుంది. మరో 11 కేంద్రాలను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చేందుకు రూ.13.75 లక్షలు వెచ్చిస్తున్నారు. మొత్తంగా క్యాంటీన్ల ఏర్పాటుకు రూ.11.43 కోట్లు ఖర్చు కానుందగా.. జూలై మూడో వారంలో రూ.3 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో రూ.4 కోట్లు, ఆగస్టు చివరి వారంలో రూ.4.43 కోట్లు విడుదల చేయాలని భావిస్తున్నారు.

# నగరంలో.. 90శాతం కల్తీ కల్లే విక్రయం..



హైదరాబాద్ సిటీ:జూలై 10 (టుడే విదుర): రాష్ట్రంలో ఒకప్పుడు ఈత, తాటి చెట్లు విపరీతంగా ఉండేవి. 50 ఏళ్ల నుంచి వ్యవసాయం, రహదారుల విస్తరణ, పట్టణాల పెరుగుదలతో చాలాచోట్ల చెట్లను కొట్టేశారు. గతంలో హైదరాబాద్ నగర పరిసరాలలో విరివిగా కనిపించే ఈత, తాటి చెట్లు ఉండగా, ప్రస్తుతం నగరానికి 50 కిలోమీటర్ల లోపు అవి కనిపించడకుండా పోయాయి. పట్టణాలకు 50 కి.మీ. లోపు తగినన్ని ఈత, తాటి చెట్లు లేకపోతే కల్లు దుకాణాలను మూసివేయాలి.మొదటి నుంచీ కల్లుకు గిరాకీ ఉండడంతో సహజ సిద్ధంగా చెట్ల నుంచి తీసే కల్లు స్థానంలో మత్తు రావడానికి ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, అల్ప్రాజోలమ్ వంటివి కలిపి కల్లును విక్రయిస్తుండడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడింది. అం దుకు తాజా సంఘటనే నిదర్శం. కూకట్‌పల్లి చుట్టుపక్కల ఉన్న కల్లు దుకాణాల్లో రెండు మూడు రోజుల కిత్రం కల్లు తాగిన వారిలో నలుగురు మృతి చెందగా.. 31 మందికి పైగా అస్వస్థతతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.%కల్తీ కల్లు విక్రయంలో ఎక్సైజ్ శాఖ తీసుకున్న చర్యలు శూన్యమని పలువురు సామాజికవేత్తలు ఆరోపిస్తున్నారు. మందు కల్లుతో అనారోగ్య సమస్యలు రావడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగరంలో ఆ కల్లును తయారుచేసి విక్రయించే దుకాణాలను మూసివేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గీత కార్మికులకు ఉపాధి పేరుతో నగరంలో ఆయా దుకాణాలను ప్రభుత్వం తెరిపించడంతో విక్రయాలు చేపట్టారు. ఎలాంటి కల్లును విక్రయించాలన్న దానిపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో 90 శాతం మందులతో తయారు చేసిన కల్లునే విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

# గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



భూదాన్‌పోచంపల్లి, జూలై 10 (టుడే విదుర): గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో, పట్టణంలోని పలు వార్డుల్లో రూ.3.58 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి మొత్తం మంజూరైన నిధులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం ఒక్క భూదాన్‌పోచంపల్లి మండలంలో రూ.17కోట్ల నిధులు హెచ్ఎండీఏ మంజూరు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పా లనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేడు అన్ని వర్గాల అభ్యున్నతికోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నా రు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, తహసీల్దా రు పి.శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు తడక వెంకటేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, ఉప్పునూతల వెంకటేషయాద వ్, కొట్టం కరుణాకర్‌రెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, మండ ల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేశయాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజిరెడ్డి, లాలయ్య పాల్గొన్నారు.

# పాత నేరస్థులపై స్పెషల్ నిఘా..

## మంచిర్యాలలో పోలీసుల తనిఖీలు



మంచిర్యాల అర్బన్,జూలై 10 (టుడే విదుర): పాత నేరస్థులపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు అర్ధరాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలివాడలో ఏరియాలో 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో కార్డెన్ అండ్ సెర్చ్, వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్, పాత నేరస్తులకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కేసుల్లో నేరస్థులు గా ఉన్న వారి వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు.%ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నేరస్థులు తమ పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే పీడీయాక్ట్ నమోదు చేసి, నగర బహిష్కరణ లాంటి చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, అనుమానితులు నిత్యం పోలీసులకు అందుబాటులో ఉండాలని, ఇతర గొడవల్లో తల దూర్చరాదని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టనున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ రత్నపురం ప్రకాష్, సీఐలు ప్రమోద్ రావు, ఆకుల అశోక్ కుమార్, ఎస్ఐలు తిరుపతి, కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో వరుస చోరీలకు పాల్పడుతున్న

## కరడుగట్టిన దొంగ అరెస్ట్..



కొత్తగూడెం టౌన్, జూలై 10 (టుడే విదుర):భద్రాద్రి కొత్తగూడెం ం మండలాల్లో, పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి బంగారం, వెండి, నగదులను దొంగిలించిన దొంగను సుజాతనగర్ పోలీసులు అరెస్టు చేశారు. దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడితోపాటు, దొంగ సొత్తు అని తెలిసీ వాటిని కొనుగోలు చేసిన వ్యక్తులను షేక్ ధారుక్ బాబా, నలమటి సాయిరామ్, విజయరావును అదుపులోకి తీసుకున్నారు. గత కొంత కాలంగా సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, చర్ల ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడ్డారు. నిందితుల నుంచి 360 గ్రాముల బంగారం(36 తులాలు), 1020 గ్రాముల(102 తులాల) వెండి, ఒక మోటార్ సైకిల్, ఒక మొబైలు ఫోన్, దొంగతనం చేయడం కోసం ఉపయోగించిన ఒక ఇనుప రాడ్, రెండు స్క్రూ డ్రైవర్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎ

# మానవత్వాన్ని చాటుకున్న గ్రామస్తులు..

## ఆవుకు ఘనంగా అంత్యక్రియలు



బజార్ హత్నూర్:జూలై 10 (టుడే విదుర):ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని మహాదేవుని ఆలయానికి (శివాలయం) చెందిన ఆవు అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు మానవత్వాన్ని చాటుకొని డబ్బు వాయిద్యాల నడుమ ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. 20 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన సబ్బిడి పుష్పలత, నందు కుటుంబ సభ్యులకు చెందిన ఆవును మహాదేవుని మందిరానికి విరాళంగా అందించారు.%అప్పటి నుంచి అది 16 దూడలకు జన్మనిచ్చింది. 20 ఏండ్లుగా ఆలయ సేవలో ఉన్న ఆవు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అంతా ఏకమై మేళ తాళాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా అంతిమయాత్రగా వెళ్లి ఆలయ ప్రాగాణంలో దహన సంస్కారాలు చేశారు.

# అధికారుల్లేకుండా గ్రామంలో సభ..



రఘునాథపాలెం,జూలై 10 (టుడే విదుర): స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని పల్లెల్లో కాంగ్రెస్ నాయకులు తెగ హడావిడి చేస్తున్నారు. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ తాము కీలకంగా ఉన్నామనిపించి స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము పోటీలో ఉండాలంటే ప్రభుత్వ పథకాలను పేదలకు తామే మంజూరు చేయించినట్లుగా ఫోజులు కొట్టాలని, తద్వారా బెర్తులు ఖరారు చేసుకొని ఆ తరువాత ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవాలని తెగ ఆరాటం పడుతున్నారు. ఇందుకోసం గ్రామాల్లో అన్నీ తామై వ్యవహరిస్తున్నారు.%ఏకంగా అధికారాన్నే చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా గ్రామంలో పెద్ద ఎత్తున సభ పెట్టి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కూడా వారే పంపిణీ చేస్తున్నారు. అధికారుల సంతకాలు లేని పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారు.అయితే, అధికారులు లేకుండా సభ పెట్టి పంపిణీ చేస్తుండడంపై గ్రామస్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోనిది మంచుకొండ గ్రామం. ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడొకరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున సభ పెట్టాడు. గ్రామంలో 80 మందికి ఇందిరమ్మ ఇళ్ల

# విద్యుత్ ఉద్యోగుల నిరసన, ధర్నా





మంచిర్యాలటౌన్,జూలై 10 (టుడే విదుర): కేంద్రప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంచిర్యాలలో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్, రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మంచిర్యాలలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, సిబ్బంది ఈ నిరసన చేపట్టారు.మంచిర్యాల సర్కిల్ జేఏసీ చైర్మన్ బొమ్మ సత్తిరెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ ఉద్యోగులు కేంద్రం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ అంశం లో అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ 220 రోజులుగా కుటుంబ సమేతంగా సమ్మె చేస్తున్నారని, వారికి మద్దతుగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో కేంద్రం విద్యుత్ సంస్థలను ప్రైవేట్ చేయాలని చూస్తే రాష్ట్ర జేఏసీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సర్కిల్ జేఏసీ కన్వీనర్ రమేశ్, కోచైర్మన్ జాడి విలాస్, కోకన్వీనర్ నూక రాజశేఖర్, ఎస్ఈఈ ఉత్తమ్‌జాడే, జేఏసీ నాయకులు దుండె కొండయ్య, అబ్దుల్ ఖలీమ్, రాచకొండ వెంకటేశ్వర్లు, శరత్, సాయికృష్ణ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# టుడే వినోదం

## యోధుడు.. ధీరుడు




పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా నుంచి 'ఎవరది ఎవరది.. అతగాడో పొడుపు కథ.. దొరకనే దొరకడే అతగాడో మెరుపుకథ.. సూర్యుడికే కన్నుగప్పి సంచరించే యోధుడు.. చంద్రుడ్నే సంచికెత్తి తస్కరించె ధీరుడు' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రబృందం. రామజోగయ్య శాస్త్రి రచించిన ఈ గీతాన్ని సాయిచరణ్, హైమత్, లోకేశ్వర్ ఆలపించారు. ఎమ్.ఎమ్.కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస.

## భరణి నాటికల ప్రదర్శన




ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ళ భరణి సినిమా ల్లోకి రాకముందే నాటకరంగంలో ప్రసిద్ధులు. ఆయన రాసిన పలు నాటికలు వివిధ నగరాలు, పట్టణాలలో ప్రదర్శితమై మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. భరణి రచనలోని చమత్కారానికి ముగ్ధులైన ప్రముఖ నటుడు రాళ్ళపల్లి ఆయన్ని సినిమా రచన కోసం మద్రాసు తీసుకెళ్ళారు. అతి తక్కువ సమయంలో భరణి తన రచనా చాతుర్యంతో సంభాషణల రచయితగా నిలదొక్కుకున్నారు. అంతేకాదు... నటుడిగానూ తెరంగేట్రమ్ చేసి మెప్పించారు. వందలాది చిత్రాలలో నటించిన భరణి, ఆ తర్వాత 'మిధునం' వంటి సినిమాను డైరెక్ట్ చేసి తన ఉత్తమాభిరుచిని చాటుకున్నారు. రచయితగా, నటుడుగా, దర్శకుడిగా భరణి తెలుగు సినిమా రంగంపై తనదైన ముద్రను వేశారు. %తనికెళ్ళ భరణి రంగస్థల జీవిత స్వర్ణోత్సవాలను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సంగమం ఫౌండేషన్ అధినేత సంజయ్ కిశోర్ నిర్వహించబోతున్నారు. జులై 13, 14 తేదీలలో హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరుగనుంది. 13వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు 'తనికెళ్ళ భరణి నాటికలు – ప్రయోగ శీలత'పై ప్రత్యేక సదస్సు ఉ ంటుంది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు నాటకోత్సవాలు మొదలవుతాయి. తొలి రోజున 'జంబూ ద్వీపం', 'గోగ్రహణం','ఛల్ ఛల్ గుర్రం' నాటికలను ప్రదర్శిస్తారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు 'గార్ధభాండం', కొక్కొరోకో' నాటికల ప్రదర్శన ఉంటుంది. ఇదే వేదికపై భరణి రాసిన నాటికల పుస్తకావిష్కణ చేస్తారు. 'సీనియర్ రంగస్థల కళాకారులతో పాటు భరణిని కూడా ప్రత్యేకంగా సత్కరించబోతున్నామ'ని సంజయ్ కిశోర్ తెలిపారు. రెండు రోజుల పాటు జరుగబోతున్న 'తనికెళ్ళ భరణి నాటకోత్సవాలు'కు పలువురు సినీ ప్రముఖులు హాజరవుతారని ఆయన అన్నారు.

## అడ్డంగా బుక్కయిన టాలీవుడ్ సెలబ్రిటీస్




ఇల్లీగల్ బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసిన కారణంగా ఏకంగా 29 మంది ఫిల్మ్ సెలబ్రిటీస్ సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్స్, యూ ట్యూబర్స్ పై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ఇ.సి.ఐ.ఆర్. ను ఫైల్ చేసింది. పబ్లిక్ గాంబ్లింగ్ యాక్ట్ 1867ను ధిక్కరించినందుకు వీరిని ఈ సెక్షన్ కింద బుక్ చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేట, విశాఖపట్నంలో వీరిపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. %పోలీసులు కేసు ఫైల్ చేసిన జాబితాలో విజయ దేవరకొండ మొదలు కొని ఎంతోమంది ప్రముఖ నటీనటులు ఉన్నారు. జంగ్లీ రమ్మీ, ఎ 23, జీత్ విన్, పారి మ్యాచ్, లోటస్ 365 తదితర సంస్థలు వీరికి వాటిని ప్రమోట్ చేసినందుకు భారీ మొత్తాన్ని పారితోషికంగా ఇచ్చినట్టు పోలీసులు భావిస్తున్నారు. వీరందరికీ త్వరలోనే సమన్లు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఇందులో కొందరు తెలియక తప్పు చేశామని అంగీకరిస్తే, మరికొందరు తమ అగ్రిమెంట్ గడువు పూర్తి అయినా... తమ ప్రకటనలు సదరు సంస్థలు వాడుకున్నాయని వాపోయారు. మరికొందరు తాము ప్రచారం చేసిన బెట్టింగ్ యాప్స్ అధికారికమైనవేనని తెలిపారు. అయితే ఫణీంద్ర శర్మ, వినయ్ వంగల వంటి వారి నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని పోలీసులు ఈ కేసును టేకప్ చేశారు.

## మరోసారి పుష్పరాజ్ సరసన...




నేషనల్ క్రష్ రశ్మిక మందణ్ణ మరోసారి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన నటించబోతోందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది. అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న సినిమాలో ఇప్పటికే ఇద్దరు హీరోయిన్లు ఫైనలైజ్ అయ్యారు. అందులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణె పేరును అధికారికంగానే ప్రకటించారు మేకర్స్. అలానే మృణాల్ ఠాకూర్ సైతం ఇందులో మరో నాయికగా నటించబోతోందని సమాచారం. వీరిద్దరూ కాకుండా ఇందులో మూడో హీరోయిన్ కూ చోటు ఉందట. ఆ పాత్ర కోసం జాన్వీ కపూర్ ను గతంలో సంప్రదించారని తెలిసింది. కారణాలు ఏవైనా ఇప్పుడు ఆ పాత్రను ఆమె చేయడం లేదట. దాంతో ఈ థర్డ్ హీరోయిన్ కోసం రశ్మిక మందణ్ణను మేకర్స్ అప్రోచ్ అయ్యారట. %నిజానికి రశ్మిక మందణ్ణ ఇవాళ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి. 'పుష్ప, పుష్ప –2' చిత్రాల తర్వాత రశ్మిక నేషనల్ క్రష్ గా మారిపోయింది. 'యానిమల్, ఛావా' సినిమాలు ఆమె స్థాయిని ఇంకాస్తంత పెంచాయి. ఈ మధ్య వచ్చిన 'సికిందర్' కమర్షియల్ గా ఆడలేదు. అలానే మొన్నొచ్చిన 'కుబేర' సైతం ఆమెను నిరాశకు గురిచేసింది. అయినా రశ్మిక చేతిలో ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ ఉన్నాయి.

## త్రీడీలో రాబోతున్న మహావతార్ నరసింహ




హొంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ సంస్థలు ప్రతిష్టాత్మక యానిమేటెడ్ ఫ్రాంచైజీ కోసం చేతులు కలిపాయి. ఈ రెండు సంస్థలు కలిసి దశాబ్ద కాలం పాటు వరుసగా సినిమాలు చేయబోతున్నాయి. విష్ణువు దశ అవతారాలను ఈ సంస్థలు తెరపైకి ఆవిష్కరించబోతున్నాయి. అందులో మొదటిది 'మహావతార్ నరసింహ'. ఈ సినిమా ఇదే నెల 25న ఐదు భారతీయ భాషల్లో విడుదల కాబోతోంది. ఆ తర్వాత 'మహావతార్ పరశురామ్ (2027), మహావతార్ రఘునందన్ (2029), మహావతార్ ధావకధేష్ (2031), మహావతార్ గోకులానంద (2033), మహావతార్ కల్కి పార్ట్ 1 (2035), మహావతార్ కల్కి పార్ట్ 2 (2037) చిత్రాలు రాబోతున్నాయి. %తాజాగా విడుదలైన 'మహావతార్ నరసింహ' ట్రైలర్ లో ఆసక్తికరంగా సాగింది. హిరణ్య కశిపుడు బ్రహ్మ దేవుడి వరం కోసం ఘోర తపస్సు చేసే సీక్వెన్స్ తో మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. విష్ణువుపై భక్తితో ప్రహ్లాదుడు, తన నాస్తిక తండ్రి హిరణ్య కశిపుడి నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటాడు. ప్రహ్లాదుడిని రక్షించడానికి దిగివచ్చిన విష్ణువు అవతారమైన మహావతార్ నరసింహుడి రాకతో ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది. ఎపిక్ విజువల్స్, అద్భుతమైన నేపథ్య సంగీతంతో ఈ ట్రైలర్ సాగింది.

## దర్శకుడు జ్యోతికృష్ణ ఎమోషనల్ పోస్ట్




ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం పెద్దకుమారుడు జ్యోతికృష్ణ . తండ్రి అడుగుజాడల్లో సినిమా రంగంలోకి వచ్చినా... నిర్మాతగా మారకుండా దర్శకుడయ్యాడు. తెలుగుతో పాటు పలు తమిళ చిత్రాలనూ డైరెక్ట్ చేశాడు జ్యోతికృష్ణ. అయితే జయాపజయాలు అతనితో దోబూచులాడాయి. తాజాగా క్రిష్ వదిలి వెళ్ళిన 'హరిహర వీరమల్లు' ప్రాజెక్ట్ ను జ్యోతికృష్ణ తండ్రి కోరిక మేరకు టేకప్ చేసి పూర్తి చేశాడు. గురువారం జ్యోతి కృష్ణ ఎక్స్ వేదిక గా పెట్టిన పోస్ట్ అతనికి పవన్ కళ్యాణ్ పై ఉన్న ప్రేమను ఆవిష్కరించేదిగా ఉంది. %ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు నిర్మించిన 'హరిహర వీరమల్లు' సినిమా ఈ నెల 24న గ్రాండ్ గా విడుదల కాబోతోంది. దానికి సంబంధించిన పనుల్లో గత కొన్ని రోజులుగా జ్యోతికృష్ణ బృందం బిజీబిజీగా ఉంది. అటువంటి సమయంలో జ్యోతికృష్ణ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. అందులో జ్యోతికృష్ణ తన భార్య, తండ్రితో పాటు ఉన్నారు. వీరందరూ కలిసి, డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ తో కలిసి కొద్దిరోజుల క్రితం ఫోటో దిగారు. జ్యోతికృష్ణ కుమార్తెను పవన్ కళ్యాణ్ ఎత్తుకుని ఉన్నారు. ఈ ఫోటోను గురువారం జ్యోతికృష్ణ పోస్ట్ చేస్తూ, 'నా హృదయానికి ఎప్పటికీ దగ్గరగా ఉండే ఫోటో ఇది. కేవలం వృత్తిపరమైన జ్ఞాపకం మాత్రమే కాదు... ఇది జీవితకాలం గుర్తుంచుకునేది' అని పేర్కొన్నారు. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ గురించి చెబుతూ, 'ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పక్కన 'హరిహర వీరమల్లు' దర్శకుడిగా నిల్చోవడం అనేది ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. సినిమా గొప్పతనాన్ని, దాని పట్ల చూపించాల్సిన నిబద్ధతను తెలిపి, నాలో స్ఫూర్తి నింపిన వ్యక్తి ఆయన. ఈ

# టుడే స్పోర్ట్స్

## శుభ్‌మన్ గిల్‌కు అది ఎవరూ నేర్పలేదు.. కెప్టెన్‌పై అశ్విన్ ప్రశంసల వర్షం..



టీమిండియా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు మైదానంలోనే కాదు, ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో కూడా ఫైట్ చేయాల్సి ఉంటుంది. కెప్టెన్లను ఇబ్బందికర ప్రశ్నలు అడిగి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి విదేశీ జర్నలిస్ట్‌లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కెప్టెన్ ఆత్మవిశ్వాసం కోల్పోతే జట్టు ప్రదర్శన కూడా దెబ్బతింటుందనేది వారి వ్యూహం. కెప్టెన్లు అందరినీ వారు అలాగే ప్రశ్నలతో ఇబ్బంది పెడుతుంటారు. అయితే టీమిండియా కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందు మాత్రం వారి ఆటలు సాగడం లేదు. ఈ విషయంలో గిల్‌పై అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. 'విదేశాల్లో కెప్టెన్‌ను టార్గెట్ చేయడం అన్నది సర్వసాధారణం. ప్రశ్నలతో ఇబ్బంది పెడుతుంటారు. దీంతో ప్రెస్‌కాన్ఫరెన్స్‌ల్లో ఎలా మాట్లాడాల్లో మన కెప్టెన్లకు ట్రైనింగ్ ఇస్తుంటారు. అయితే గిల్ మాత్రం చాలా సహజంగానే ఈ నైపుణ్యాన్ని సంపాదించాడు. చాలా ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతున్నాడు. ఎక్కడా షో చేస్తున్నట్టు అనిపించడం లేదు. తాను ఏం మాట్లాడాలనుకుంటున్నాడో అలాగే మాట్లాడుతున్నాడు. పాతికేళ్లకే ఇలాంటి పరిణితి సాధించడం చాలా గొప్ప విషయం' అని అశ్విన్ ప్రశంసించాడు.

## గిల్‌క్రిస్ట్‌తో పోలికా.. పంత్ చాలా బెటర్.. అశ్విన్ సంచలన వ్యాఖ్యలు..



టీమిండియా వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ప్రస్తుత ఇంగ్లండ్ పర్యటనలో అమోఘంగా రాణిస్తున్నాడు. తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేశాడు. ఇక, రెండో మ్యాచ్‌లో కీలకమైన సమయంలో వేగంగా ఆడుతూ హాఫ్ సెంచరీ (58 బంతుల్లో 65) సాధించాడు. ఈ నేపథ్యంలో పంత్‌ను ఆస్ట్రేలియా లెజెండరీ వికెట్ కీపర్ బ్యాటర్ అయిన ఆడమ్ గిల్‌క్రిస్ట్‌తో చాలా మంది పోల్చుతున్నారు. అయితే మాజీ క్రికెటర్ అశ్విన్ మరో అడుగు ముందుకేసి గిల్‌క్రిస్ట్ కంటే పంత్ బెటర్ బ్యాటర్ అని కితాబిచ్చాడు.'పంత్ నిజంగా ఉత్తమ ఆటగాడు. అతడు గిల్‌క్రిస్ట్ కాదు. పంత్ తరహా క్వాలిటీ డిఫెన్స్ గేమ్ గిల్‌క్రిస్ట్ దగ్గర లేదు. పంత్‌ను గిల్‌క్రిస్ట్‌తో కాదు.. క్లాస్ బ్యాటర్లతో పోల్చాలి. పంత్ తనకు మాత్రమే సాధ్యమైన ఆటతీరుతో అదరగొట్టగలడు. పంత్ ఇక ఎంత మాత్రం జూనియర్ ఆటగాడు కాదు. అతడి సత్తా ఏంటో ఇప్పుడు అందరికీ తెలుస్తోంది. పంత్ తన స్టాండర్డ్స్‌కు తగిన విధంగా బెంచ్‌మార్క్‌ను సెట్ చేయాలి. తర్వాతి తరం వారికి రోల్ మోడల్‌లా నిలవాలి' అని అశ్విన్ పేర్కొన్నాడు.ాజా పర్యటనలో రిషభ్ పంత్ ఓ అరుదైన మైలు రాయిని చేరుకున్నాడు. ల (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో 2000 పైచిలుకు పరుగులు సాధించిన తొలి ఆసియా వికెట్ కీపర్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. టెస్ట్ మ్యాచ్‌ల్లో తనదైన వేగంతో ఆడుతూ పంత్ ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్నాడు. తొలి టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పంత్ సెంచరీలు చేశాడు. ఆండీ ఫ్లవర్ తర్వాత ఒక టెస్ట్ మ్యాచ్‌లో రెండు సెంచరీలు సాధించిన వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నిలిచాడు.

## ఎవరో లార్డ్స్ కింగ్




లండన్: తొలి టెస్ట్‌లో ఓటమితో తీవ్ర ఒత్తిడి.. మ్యాచ్‌ను మలుపుతిప్పగల బుమ్రాకు విశ్రాంతి.. ఈ పరిస్థితుల్లో భారత జట్టు పుంజుకోవడం కష్టమేనన్న విమర్శలు..! అయితే, శుభ్‌మన్ గిల్ సేన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి.. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయాన్ని దక్కించుకొంది. గిల్ సూపర్ బ్యాటింగ్.. పేసర్ ఆకాశ్‌దీప అద్భుత బౌలింగ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసి ప్రత్యర్థితో ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరింది. ఇదే జోష్‌లో గురువారం నుంచి ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగే మూడో టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. బుమ్రా రీఎంట్రీతో.. తడబడుతున్న ఇంగ్లండ్‌కు కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. నయా కెప్టెన్ గిల్ సారథ్యంలోని యువ భారత్.. లీడ్స్‌లోనూ పైచేయి సాధించినా కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చడం జట్టుకు శాపంగా మారింది. కానీ, దీని నుంచి వేగంగా పాఠాలు నేర్చిన భారత్.. రెండో టెస్ట్‌లో ప్రతి సెషన్‌లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాట్‌తో చెలరేగిన గిల్ అండ్ కో కొండంత స్కోర్లు చేయడంతో.. ప్రత్యర్థి కెప్టెన్ బెన్ స్టోక్స్ జీవమున్న పిచ్ కోసం డిమాండ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లార్డ్స్‌లో సీమ్ బౌలర్లకు అనుకూలించే పిచ్‌ను రూపొందించే విధంగా ఒత్తిడి చేశారని సమాచారం. మరోవైపు బుమ్రా రాకతో ఇంగ్లండ్ బ్యాటర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. కరుణ్ నాయర్ వైఫల్యం మినహా భారత బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ ఆందోళనకర పరిస్థితులు లేవు. గిల్ సూపర్ ఫామ్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. జైస్వాల్, రాహుల్, పంత్, జడేజా రాణిస్తుండడం శుభపరిణామం. గత మ్యాచ్‌లో పేసర్లు ఆకాశ్‌దీప, సిరాజ్ రాణించగా.. ధారాళంగా పరుగులిచ్చిన ప్రసిద్ధ్ కృష్ణను బుమ్రా కోసం పక్కనపెట్టే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్లుగా జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్‌ను కొనసాగించే చాన్సులున్నాయి.

## జ్యోతి సురేఖ జోడీ ప్రపంచ రికార్డు



మాడ్రిడ్: తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషభ్ యాదవ్ ద్వయం కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ప్రపంచ రికార్డు తిరగ రాసింది. వరల్డ్ కప్ ఆర్చరీ నాలుగో దశలో భాగంగా బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ విభాగం క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత జోడీ సంయుక్తంగా 1431 పాయింట్లు సాధించారు. వీటిలో జ్యోతి సురేఖ 715, రిషభ్ 716 పాయింట్లతో నిలిచారు. దాంతో డెన్మార్క్ ద్వయం గెలెంతియన్/ఫుల్లెర్టన్ పేరిట 1429 పాయింట్లతో 2023 నుంచి ఉన్న గత వరల్డ్ రికార్డు తుడిచి పెట్టుకుపోయింది. ఇక..కాంపౌండ్ మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకుపోవడంతో భారత్‌కు ఒక పతకం ఖరారైంది. మరోవైపు పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో పరాజయం చవిచూసింది. జ్యోతి సురేఖ, ప్రణీత్ కౌర్, ప్రతికతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో 230-226తో ఇండోనేసియాను ఓడించింది. స్వర్ణం కోసం శనివారం జరిగే పోరులో 10వ సీడ్ చైనీస్ తైపీ జట్టుతో జ్యోతి త్రయం తలపడనుంది.

## స్వియటెక్ అదుర్స్



లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో ఎనిమిదో సీడ్ ఇగా స్వియాటెక్ మొదటిసారి సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఫైనల్లో చోటు కోసం అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్‌తో ఈ పోలెండ్ భామ గురువారం అమీతుమీ తేల్చుకోనుంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్వియాటెక్ 6-2, 7-5తో వరుస సెట్లలో 19వ సీడ్ లుడ్మిలా సంసనోవా (రష్యా)పై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్‌ఫైనల్లో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్) 7-6 (3), 7-6 (2)తో ఏడో సీడ్, టీనేజర్ ఆండ్రీవా (రష్యా)కు షాకిచ్చింది. మహిళల మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్)-13వ సీడ్ అమండా అనిసిమోవా (అమెరికా) తలపడనున్నారు. స్వియాటెక్ ఐదు గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకున్నా...అందులో నాలుగు టైటిళ్లు మట్టి కోర్టు అయిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సాధించినవే. మరొకటి హార్డ్‌కోర్ట్ అయిన యూఎస్ ఓపెన్‌లో గెలిచింది. అలాగే హార్డ్ కోర్టులపై సాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె రెండుసార్లు సెమీస్‌కు చేరింది. కానీ పచ్చికపై ఆడే వింబుల్డన్‌లో స్వియాటెక్ గతంలో ఐదుసార్లు తలపడినా..ఒక్కసారే క్వార్టర్‌ఫైనల్ వరకు రాగలిగింది.పురుషుల టాప్ సీడ్ యానిక్ సినర్, ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు. క్వార్టర్‌ఫైనల్లో సినర్ (ఇటలీ) 7-6 (2), 6-4 6-4తో 10వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)ను చిత్తు చేశాడు. గాయంతో బాధపడుతూ కూడా మ్యాచ్‌ను సినర్ వరుస సెట్లలో ముగించడం విశేషం. మరో క్వార్టర్‌ఫైనల్లో జొకోవిచ్ 6-7(8), 6-2, 7-5, 6-4తో 22వ సీడ్ ఫ్లావియో కొబొల్లి (ఇటలీ)పై గెలిచి వరుసగా ఏడోసారి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సినర్‌తో జొకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

## టాప్ 10లో తొలిసారి



దుబాయ్: ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్లాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో గిల్ తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకాడు. ఫలితంగా 6వ ర్యాంక్‌లో నిలిచి కెరీర్ బెస్ట్ అందుకున్నాడు. అంతకుముందు టెస్టుల్లో గిల్ అత్యుత్తమ ర్యాంక్ 14 (2023 సెప్టెంబరులో) మాత్రమే. యశస్వీ జైస్వాల్ 4వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ నెంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతుండగా.. జో రూట్ (ఇంగ్లండ్), కేన్ విలియమ్సన్ (న్యూజి లాండ్) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో బుమ్రా టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, సిరాజ్ 22వ స్థానానికి ఎగబాకాడు. ఆల్‌రౌండర్లలో జడేజా అగ్రస్థానంలో మార్పు లేదు.

టుడే బిజినెస్

# స్వల్పంగా తగ్గిన బంగారం ధర..

## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




ఇటీవలి కాలంలో ఆల్‌టైమ్ గరిష్టానికి చేరిన బంగారం వెండి ధరలు ప్రస్తుతం దిగి వస్తున్నాయి. గత వారం లక్ష రూపాయలను దాటేసిన బంగారం ప్రస్తుతం 98 వేలకు దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 10న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 98, 170కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 89, 990కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్ల బంగారం ధర రూ.600 మేర, 22 క్యారెట్ల బంగారం ధర రూ.500 మేర తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 98, 320కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 90, 140కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98, 170కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 89, 990కి చేరింది. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# వేదాంత ఓ పేక మేడ

**భరించలేని స్థాయికి అప్పుల భారం.. రుణదాతలకు గండమే..**
**%అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక**
**ఒకదశలో 8% పతనమైన వేదాంత లిమిటెడ్ షేరు**




న్యూఢిల్లీ: రెండున్నరేళ్ల క్రితం అమెరికన్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్‌పై అకౌంటింగ్ అక్రమాల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్.. ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని ఓ నివేదిక విడుదల చేసింది. వేదాంత గ్రూప్ భరించలేని అప్పులు, నిధుల దోపి డీ, అకౌంటింగ్ అవకతవకల పునాదులపై నిర్మించిన ఓ పేక మేడ అని, ఎప్పుడైనా కూలవచ్చని వైస్రాయ్ రీసెర్చ్ అంటోంది. ఆర్థికంగా నిలకడ తప్పిన, వ్యాపార కార్యకలాపాల్లోనూ రాజీపడిన ఈ గ్రూప్‌తో రుణదాతలకు గండమేనని పేర్కొంది. గ్రూప్ కార్యకలాపాలు పోంజీ స్కీమ్‌ను తలపిస్తున్నాయంది. బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూప్ హోల్డింగ్ కంపెనీ వేదాంత రిసోర్సెసను (వీఆర్‌ఎల్) సొంత కార్యకలాపాల్లేని ఓ పరాన్న జీవిగా అభివర్ణించింది. అప్పులు తిరిగి చెల్లించేందుకు ఈ కంపెనీ భారత అనుబంధ విభాగమైన వేదాంత లిమిటెడ్ నిధులను క్రమంగా పీల్చి పిప్పి చేస్తోందంటూ బుధవారం విడుదల చేసిన 85 పేజీల నివేదికలో వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో వీఆర్‌ఎల్‌కు చెందిన బాండ్లు, ఇతర రుణ సాధనాలపై షార్ట్ పొజిషన్లు తీసుకున్నట్లు వెల్లడించింది.

# ఫ్లాట్‌గా ట్రేడ్ అవుతున్న స్టాక్ మార్కెట్లు..

## ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..




అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో దేశీయ సూచీలు ఈ రోజు కూడా ఫ్లాట్‌గానే ట్రేడ్ అవుతున్నాయి. కాఫర్ దిగుమతులపై 50 శాతం సుంకం విధించడం, ఫార్మా ఉత్పత్తులపై కూడా భారీ పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఆయా రంగాలు నష్టాల బాట పట్టాయి. మిగిలిన రంగాలు స్వల్ప నష్టాలతో కదలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో ఊగిసలాడుతున్నాయి. బుధవారం ముగింపు (83, 536)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాసేపు లాభాల్లో కదలాడింది. 83,742 వద్ద గరిష్టానికి చేరింది. ఆ వెంటనే నష్టాల్లోకి వచ్చేసింది. ప్రస్తుతం ఉదయం 10:20 గంటల సమయంలో సెన్సెక్స్ 179 పాయింట్ల పాయింట్ల నష్టంతో 83, 356 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 64 పాయింట్ల నష్టంతో 25, 411 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో ప్రేస్టేజ్ ఎస్టేట్, గ్లెన్‌మార్క్, పేటీఎమ్, పవర్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. పీఐ ఇండస్ట్రీస్, భారత్ డైనమిక్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, ఇన్ఫోఎడ్జ్, టాటా మోటార్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 12 పాయింట్ల స్వల్ప లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 20 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.62గా ఉంది.

# 4 లక్షల కోట్ల డాలర్లకు ఎన్‌విడియా మార్కెట్ క్యాప్




న్యూయార్క్: అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌విడియా షేర్లు స్టాక్‌మార్కెట్‌లో రికార్డులు సృష్టిస్తున్నాయి. బుధవారం కంపెనీ షేర్లు 2.5 శాతం లాభంతో 164 డాలర్లకు చేరాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో నాలుగు లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.342.6 లక్షల కోట్లు) చేరింది. ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ ఈ స్థాయికి చేరలేదు. 2023 ప్రారంభంలో 14 డాలర్ల వద్ద ట్రేడైన ఎన్‌విడియా షేర్లు ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) బూమ్‌తో 164 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. రెండేళ్లలోనే ఎన్‌విడియా షేర్ల మార్కెట్ క్యాప్ 60,000 కోట్ల డాలర్ల నుంచి నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరడం విశేషం.

# అమెరికాలో ధరలు పెంచేస్తాం




న్యూఢిల్లీ: ట్రంప్ యంత్రాంగం ఔషధ దిగుమతులపై 200 శాతం సుంకాలు విధించినట్టయితే అమెరికన్ మార్కెట్లో తమ ఉత్పత్తుల ధరలు పెంచక తప్పదని ఫార్మా పరిశ్రమ హెచ్చరించింది. అయితే ప్రస్తుతానికి అది హెచ్చరిక మాత్రమేనని, టారిఫ్ ల పెంపు ఆ స్థాయిలో ఉండకపోవచ్చునని పేర్కొంటూ అలాంటి నిర్ణయం గనుక తీసుకున్నట్టయితే తాము ధరలు పెంచుతామని, అది అమెరికన్ వినియోగదారులకు భారం కాక తప్పదని పరిశ్రమ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరన్నారు. సుంకాలు పెంచితే అమెరికాలో హెల్త్‌కేర్ సంబంధిత ద్రవ్యోల్బణం గణనీయంగా పెరుగుతుందంటున్నారు. %మార్జిన్ల ఒత్తిడి తప్పదు: చిన్న ఫార్మా కంపెనీలు అతి తక్కువ మార్జిన్‌తో అమెరికాకు ఔషధాలు సరఫరా చేస్తున్నాయని, వాటిపై మార్జిన్ల ఒత్తిడి విపరీతంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఔషధాలపై భారత్ 10 శాతం సుంకాలు వసూలు చేస్తుండగా అమెరికా ఎలాంటి సుంకాలు విధించడంలేదు. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా కీలక మార్కెట్ అని, వాటి మొత్తం ఆదాయంలో 30-40 శాతం అమెరికన్ మార్కెట్ నుంచే వస్తుందని ఇక్రా వైస్ ప్రెసిడెంట్, ఫార్మా హెడ్ దీపక్ జోత్వానీ అన్నారు. భారత ఫార్మా కంపెనీలు ప్రధానంగా జెనరిక్ ఔషధాలు అమెరికన్ మార్కెట్‌కు సరఫరా చేస్తాయని, ఆ విభాగంలో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. అధిక టారిఫల వల్ల ఫార్మా రంగంలో ఎగుమతుల వృద్ధి, లాభదాయకత రెండూ ప్రభావితం అవుతాయన్నారు. భారత కంపెనీలు సరఫరా చేసిన ఔషధాల వల్ల 2022 సంవత్సరంలో అమెరికన్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు 21,900 కోట్ల డాలర్లు (రూ.18.83 లక్షల కోట్లు) ఆదా అయినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.అమెరికా ప్రతిపాదించిన మేరకు రాగిపై 50 శాతం సుంకాలు విధించినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండదని ఇంటర్నేషనల్ కాపర్ ఆసోసియేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మయూర్ కర్మార్కర్ అన్నారు. భారత్ రాగి కొరత దేశమని, అందువల్ల అమెరికాకు తమ ఎగుమతులు కేవలం 10 వేల టన్నులేనని ఆయన చెప్పారు. భారత్ పునరుత్పాదక ఇంధనం, ఈవీలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నందు వల్ల దేశీయంగానే డిమాండు అధికంగా ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు.

# హైదరాబాద్ స్టార్టప్‌లో ఇండిగో వెంచర్స్ పెట్టుబడి




ముంబై: హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ జే ఏరోస్పేస్‌లో పెట్టుబడి పెట్టినట్టు ఇండిగో విమానయాన సంస్థ అనుబంధ వెంచర్ క్యాపిటల్ విభాగం ఇండిగో వెంచర్స్ ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందీ వెల్లడించలేదు. జే ఏరోస్పేస్ కంపెనీ ఈ నిధులను డిజిటల్ ఉత్పత్తి సామ ర్థ్యాల పెంపుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏఐ ఆధారిత ఉ త్పత్తి విధానాలు, నిపుణులైన ఉద్యోగుల నియామకానికి ఉపయోగించుకుంటుందంటున్నారు. ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు తాము లక్ష్యంగా పెట్టుకున్న రూ.600 కోట్లలో ఇప్పటికే రూ.450 కోట్లు సమీకరించినట్టు ఇండిగో వెంచర్స్ తెలిపింది.

# అమెరికాలో ధరలు పెంచేస్తాం




న్యూఢిల్లీ: గ్రాన్యూల్స్ ఇండియా రక్తపోటును తగ్గించే మెటోప్రోలాల్ సక్సనేట్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ టాబ్లెట్స్ 33,000 బాటిల్స్‌ను అమెరికన్ మార్కెట్ నుంచి రీకాల్ చేసింది. తయారీ లోపాలున్నట్టుగా గుర్తించినందు వల్ల ఈ చర్య తీసుకున్నట్టు అమెరికన్ డ్రగ్ రెగ్యులేటర్ యూఎసఎఫడీఏ ప్రకటించింది. భారత్‌లో తయారైన ఈ టాబ్లెట్లు పూర్తిగా నీటిలో కరగలేదని, ఇది వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఎఫ్‌డీఏ తెలిపింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006